BHARATH SAMACHAR DIGITAL

17, నవంబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు కీలక భేటీ..!



భారత్ సమాచార్, అమరావతి : వరుస తుఫాన్ల దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ఆయన.. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా ఏపీకి రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు వివరించారు. ఇప్పటికే నష్టాలకు సంబంధించిన ప్రాథమిక నివేదికలను కేంద్రానికి అందించామని, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం నుంచి ఆర్థిక సహకారం అందితే బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయవచ్చని తెలిపారు.

రెండు తుఫాన్ల ప్రభావంతో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదని చంద్రబాబు వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా సాగుకు ఇబ్బందులు ఎదురైనా పట్టిసీమ ద్వారా రైతులకు నీటిని అందించామని, అయితే తుఫాన్ల కారణంగా చేతికొచ్చిన పంటలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. తీర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, రహదారులు సహా పలు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని, వాటి నివేదికల ఆధారంగా త్వరితగతిన సాయం అందించాలని కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపైనా చర్చ జరిగినట్లు సమాచారం. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని కోరారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ రహదారులు, సాగునీటి సదుపాయాలు, డ్రిప్ ఇరిగేషన్ పనులకు నిధులు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు.

మరోవైపు విశాఖ ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్నాయని సీఎం తెలిపారు. ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో వచ్చిన పెట్టుబడులు, కుదిరిన ఒప్పందాల వివరాలను నిర్మలా సీతారామన్‌కు వివరించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. తుఫాన్ల నష్టాల నుంచి రాష్ట్రం కోలుకోవడంతో పాటు అభివృద్ధి ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే కేంద్ర సహకారం కీలకమని చంద్రబాబు అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే కేంద్రం నుంచి ఎంతమేరకు సాయం అందుతుందనే దానిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.